డాక్టర్ చంద్రిక అవినాష్

చంద్రిక అవినాష్‌కు మిస్సెస్ వరల్డ్ పీస్ కిరీటం

నిర్మల్ చైన్‌గేట్, జూన్ 4: నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ స్త్రీ వైద్య నిపుణురాలు డాక్టర్ చంద్రిక అవినాష్ ప్రతిష్ఠాత్మకమైన మిస్సెస్ వరల్డ్ పీస్-2024 అందాల పోటీల్లో రాణించి కిరీటాన్ని కైవసం చేసుకున్నారు. హర్యానా రాష్ట్రంలోని గుర్‌గావ్‌లో గ్లామర్ గుర్‌గావ్ సంస్థ ద్వారా మే 28 నుంచి జూన్ 1వ తేదీ వరకు పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో దేశవ్యాప్తంగా ఫైనల్స్‌కు చేరుకున్న 140 మంది పోటీదారులలో చంద్రిక అవినాష్ అన్ని రంగాల్లో ప్రతిభ కనబరిచి మిస్సెస్ ఇంటలెక్చువల్ సబ్‌టైటిల్, మిస్సెస్ వరల్డ్ పీస్ కిరీటాన్ని సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తనను అనునిత్యం ప్రోత్సహించి ధైర్యాన్ని చ్చిన తన భర్త డాక్టర్ అవినాష్, అత్త దేవీబాయి, స్నేహితులు, శ్రేయోభిలాషులు, సోషల్ మీడియా ఫాలోవర్స్‌కు ఈ అవార్డును అంకితం ఇస్తున్నట్టు ప్రకటించారు. తన గురువు మెంటర్, గ్లామర్ గుర్‌గావ్ డైరెక్టర్ బార్బ నాంగియా ఈ అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ-సైకిల్ భళా

- 20 వేల ఖర్చుతో బ్యాటరీతో నడిచే సైకిల్ తయారు చేసిన యువకుడు
- 2 గంటలు చార్జింగ్ పెడితే 30 కిలో మీటర్ల ప్రయాణం
- మల్లేశ్‌కు అభినందనల వెల్లువ

బ్యాటరీతో నడిచే సైకిల్ (ఇన్‌సెట్‌లో) సాంబారి మల్లేశ్

దండేపల్లి, జూన్ 4 : చదివింది పదోతరగతే అయినా తన ఆలోచనతో ఈ-సైకిల్ రూపొందించి అందరిచే శభాష్ అనిపించుకుంటున్నాడు మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం నాగసముద్రం గ్రామానికి చెందిన సాంబారి మల్లేశ్. ఇంజినీర్లకు తానేం తక్కువ కాదని నిరూపించాడు. బ్యాటరీ సైకిల్‌తో రోడ్డుపై రయ్.. రయ్‌మని ప్రయాణిస్తూ అందరిదృష్టిని ఆకర్షిస్తున్నాడు. గతంలో ప్రైవేట్ ఎల్కట్రీషియన్‌గా పనిచేశాడు. అప్పట్లోనే పలు ఆవిష్కరణలు చేశాడు. సెల్‌ఫోన్ సాయంతో ఇంటి నుంచే వ్యవసాయ మోటర్లు ఆన్.. ఆఫ్ చేయడం, చప్పట్లతో వెలిగే కరెంటు బల్బులు తయారుచేయడం లాంటివి చేశాడు. అనంతరం బతుకుదెరువు కోసం విదేశాలకు వెళ్లిన మల్లేశ్ సెలవులకు ఇంటికి వచ్చి నూతన ఆవిష్కరణలపై దృష్టిపెట్టాడు.

రెండు గంటలు చార్జిచేస్తే 30 కిలోమీటర్లు..

బ్యాటరీ సాయంతో నడిచే సైకిల్ తయారు చేయాలనే ఆలోచనతో మొదట రూ.5 వేలతో సైకిల్ కొనుగోలు చేశాడు. రూ.6 వేలతో పీఎండీసీ గేర్ మోటర్ కిట్, రూ.9 వేలతో 24వోల్టుల సామర్థ్యమున్న రీచార్జబుల్ బ్యాటరీని కొనుగోలు చేశాడు. మొత్తం రూ.20 వేల ఖర్చుతో బ్యాటరీ సైకిల్‌ను తయారు చేసి ఔరా అనిపించాడు. సుమారు 2 గంటలపాటు చార్జింగ్ పెడితే 30 కిలో మీటర్లపాటు 25 నుంచి 30 కిలోమీటర్ల వేగంతో ప్రయాణం చేయవచ్చు. దారి మధ్యలో చార్జింగ్ అయిపోయినా సైకిల్‌లా తొక్కుతూ గమ్యం చేరుకోవచ్చు. ఈ సైకిల్ తయారు చేయడానికి కేవలం నెల రోజులు పట్టిందని మల్లేశ్ తెలిపాడు. కొన్ని పరికరాలు ఆన్‌లైన్‌లో తెప్పించినట్టు పేర్కొన్నాడు. ప్రస్తుత ట్రెండ్ అంతా ఎల్కట్రిక్ వాహనాల చుట్టూ తిరగడం వల్లే ఈ-సైకిల్ తయారు చేశానని తెలిపాడు. కాలుష్యరహిత వాహనం తయారు చేసి పర్యావరణానికి మేలు చేస్తున్న తనకు ప్రభుత్వం సాయం చేస్తే మరిన్ని ఆవిష్కరణలు చేస్తానని చెబుతున్నాడు.

ఎన్‌హెచ్ 65పై 17 బ్లాక్‌స్పాట్లు

- ప్రమాదాల నివారణకు చర్యలు
- అండర్‌పాస్‌లు, ఎలివేటెడ్ కారిడార్లకు తక్షణ ఏర్పాట్లు
- త్వరలోనే పనులు ప్రారంభం

హైదరాబాద్, జూన్ 4 (నమస్తే తెలంగాణ): రెండు తెలుగు రాష్ట్రాలను కలిపే అత్యంత కీలకమైన హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి-65పై 17 ప్రాంతాల్లో అత్యధికంగా రోడ్డు ప్రమాదాలు (బ్లాక్‌స్పాట్) జరుగుతున్నట్టు గుర్తించారు. ఆయాచోట్ల ప్రమాదాలు జరుగకుండా నివారణ చర్యలు చేపట్టబోతున్నారు. ఈ హైవేపై సహజంగానే ట్రాఫిక్ రద్దీ అధికం. ఈ రహదారిపై గ్రామాలు, మూలమలుపులు, క్రాసింగ్‌లు ఉన్న ప్రాంతాల్లో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇందులో ముఖ్యంగా 17 ప్రాంతాల్లో ఘోర రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నట్టు గుర్తించారు. ఈ ప్రాంతాల్లో అండర్‌పాస్‌లు, ఎలివేటెడ్ కారిడార్లు, జంక్షన్ ఇంప్రూవ్‌మెంట్లు తదితర చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. రోడ్డు ప్రమాదాలకు సంబంధించి రాష్ట్ర పోలీసుశాఖ నమోదుచేసిన వివరాలను జాతీయ రహదారులశాఖ పరిధిలోని ట్రాన్స్‌పోర్ట్ రిసెర్చ్ వింగ్ (టీఆర్‌డబ్ల్యూ) పరిశీలించి బ్లాక్‌స్పాట్‌లను ఖరారు చేస్తుంది. రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వశాఖ ప్రకారం, 500 మీటర్లలో వరుసగా మూడేండ్లలో ఐదు రోడ్డు ప్రమాదాలు జరిగి మరణాలు, తీవ్ర గాయాలు సంభవించడం, లేక ఒకేసారి జరిగిన ప్రమాదంలో 10 మరణాలు సంభవించడం.. ఈ ప్రాంతాన్ని బ్లాక్‌స్పాట్‌గా పరిగణిస్తారు. ఇటువంటి బ్లాక్‌స్పాట్లు హైదరాబాద్-విజయవాడ హైవేపై 17 ఉన్నాయి. ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలతో కూడిన నివేదికను జాతీయ రహదారులశాఖ రూపొందించింది. త్వరలోనే పనులు ప్రారంభించనున్నట్టు అధికారవర్గాలు తెలిపాయి.

17 బ్లాక్‌స్పాట్లలో అండర్‌పాస్‌లు, జంక్షన్ల అభివృద్ధి ప్రతిపాదనలు ఇలా..

- ఇరువైపులా లైటింగ్‌తో కూడిన సర్వీసు రోడ్ల నిర్మాణం- కటకమ్మగూడెం, మేళ్లచెరువు, శ్రీరంగాపురం, ఇనుపాముల.
- రోడ్ సైనేజెస్‌తోపాటు స్ట్రీట్ లైటింగ్‌తో కూడిన జంక్షన్ ఇంప్రూవ్‌మెంట్- నవాబ్‌పేట్ జంక్షన్, ఆకుపాముల, కట్టంగూర్, దురాజ్‌పల్లి జంక్షన్.
- అండర్‌పాస్(వీయూపీ)లు- రామాపురం క్రాస్‌రోడ్స్, కోమరబండ క్రాస్‌రోడ్, ముకుందాపురం, పెద్దకాపర్తి, చిట్యాల, చౌటుప్పల్, టేకుమట్ల, ఎస్వీకాలేజ్, జనగామ జంక్షన్.

సందిగ్ధంలో పారిశ్రామికం!

- ఏపీలో ప్రభుత్వ మార్పుతో సర్వత్రా ఉత్కంఠ
- హైదరాబాద్‌కు తిరుగు లేదంటున్న పారిశ్రామిక వర్గాలు

హైదరాబాద్, జూన్ 4 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటినుంచి నెమ్మదించిన పారిశ్రామికరంగం, పొరుగు రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో మరింత సందిగ్ధంలో పడింది. ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీఏ భాగస్వామ్యపక్షమైన టీడీపీ అధికారంలోకి వస్తుండటంతో సహజంగానే ఆ రాష్ట్రానికి కేంద్రం నుంచి మరింత సహకారం ఉంటుందనే ఊహాగానాలు వ్యక్తమవుతున్నాయి. గత బీఆర్ఎస్ పాలనలో హైదరాబాద్ నగరం పారిశ్రామికంగా తిరుగులేని స్థానానికి ఎదగడంతో ఏపీలో ప్రభుత్వం మారినా ఇప్పటికిప్పుడు మన రాష్ట్రానికి వచ్చిన ఢోకా ఏమీ లేదని కొందరు పారిశ్రామికవేత్తలు అభిప్రాయపడుతున్నారు. అనేక జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడుల రాకతో హైదరాబాద్ దేశం లో పెట్టుబడుల గమ్యస్థానంగా ఎదిగింది. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తరువాత పెట్టుబడుల రాక పూర్తిగా నిలిచిపోవడమే కాకుండా పలు కంపెనీలు ఇతర రాష్ట్రాలకు తరలివెళ్లాయి. కరెంటు కోతలు మొదలుకావడం, గతంలో కొనసాగిన పథకాలు నిలిచిపోవడం, రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎటువంటి సహకారం లభించకపోవడంతో పారిశ్రామికరంగం సందిగ్ధ పరిస్థితిని ఎదుర్కొంటున్నది. ఎంఎస్ఎంఈలు సహా వివిధ రంగాలకు కొత్త పాలసీలు తెస్తామని, ఫార్మాసిటీని రద్దుచేసి దాని స్థానంలో ఫార్మా క్లస్టర్లను ఏర్పాటుచేస్తామని చెప్పినప్పటికీ వీటిపై ఎటువంటి పురోగతి లేకపోవడం పారిశ్రామికరంగాన్ని అయోమయంలో పడేసింది. దీంతో చిన్నా చితకా ఎంఎస్ఎంఈలు ఏర్పాటుచేసుకొని సొంతకాళ్లపై నిలబడాలనుకునే యువత కూడా ఏమి చేయాలో అర్థంకాక యూనిట్లు పెట్టేందుకు ధైర్యం చేయడం లేదు. పరిశ్రమల స్థాపన కోసం గతంలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే భూములు కేటాయించగా, ఆరు నెలలుగా ఈ ప్రక్రియంతా నిలిచిపోయింది. గతంలో పెట్టుబడుల ఆకర్షణ కోసం అప్పటి పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ నిరంతరం ప్రయత్నించగా, ప్రస్తుతం పరిశ్రమలను పట్టించుకునే నాథుడే కరువయ్యాడు.

ఏపీకి కేంద్రం అండ..

పొరుగు రాష్ట్రమైన ఏపీలో ఎన్డీఏ భాగస్వామ్యపక్షంగా ఉన్న టీడీపీ అధికార పగ్గాలు చేపడుతున్నది. టీడీపీ సర్కారు ఏపీలో పరిశ్రమల అభివృద్ధికి, పెట్టుబడుల ఆకర్షణకు విశేషంగా కృషి చేస్తుందనే ప్రచారం ఉన్నది. రాష్ట్రానికి శాశ్వత రాజధానిని ఏర్పాటుచేయడంతోపాటు స్థానిక ఉత్పత్తులకు అనుబంధంగా పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు రానున్న ప్రభుత్వం ప్రయత్నిస్తుందనే ఆశాభావం కొందరు పారిశ్రామికవర్గాల నుంచి వ్యక్తమవుతున్నది. దీని కితోడు కేంద్రంలో ఏర్పడనున్న ఎన్డీఏ సర్కారు ద్వారా పెద్ద ఎత్తున ప్రోత్సాహకాలను కూడా సాధించే అవకాశం ఉన్నదని చెప్పున్నారు. ఈ అంశాల కారణంగా ఏపీలో పెట్టుబడులకు అవకాశాలు మెరుగయ్యే ఆస్కారం ఉంటుందని అంటున్నారు. అయితే రాష్ట్రంలోని కొందరు పారిశ్రామికవేత్తలు మాత్రం ఈ ఊహాగానాలను కొట్టిపారేస్తున్నారు. పొరుగు రాష్ట్రంలో ప్రభుత్వం మార్పు రాష్ట్ర పారిశ్రామికరంగంపై ఎటువంటి ప్రతికూల ప్రభావం చూపే అవకాశం లేదని అంటున్నారు. హైదరాబాద్ ఇప్పటికే పెట్టుబడులకు గమ్యస్థానంగా ఉన్నదని, దేశంలోని ఏ నగరానికి లేని అనేక అనుకూలతలు హైదరాబాద్‌కు ఉన్నాయని ఉదహరిస్తున్నారు. ముఖ్యంగా ఐటీ రంగంలో బెంగుళూరును ఢీకొనే స్థాయికి చేరుకోగా, ఫార్మారంగానికి రాజధానిగా ఎదిగిందని, ఆయా రంగాల ఎకోసిస్టం బలంగా ఉన్నందున మన రాష్ట్ర పారిశ్రామికరంగానికి వచ్చే ముప్పు ఏమీ ఉండకపోవచ్చని అంటున్నారు. బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో హైదరాబాద్ పేరు ప్రఖ్యాతులు దేశ విదేశాల్లో ఎంతో ప్రాచుర్యం లభించి అనేక కంపెనీలు ఇప్పటికే ఇక్కడ ఏర్పాటయ్యాయని, దీంతో రాష్ట్ర ప్రభుత్వం నుంచి సహకారం లభిస్తే కొత్తగా వచ్చే పెట్టుబడులకు హైదరాబాదే మొదటి ప్రాధాన్యంగా ఉంటుందని అభిప్రాయపడుతున్నారు. పారిశ్రామిక రంగంపై ఏపీలో ఏర్పడబోయే ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలు, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వైఖరి తదితర అంశాలపైనే రాష్ట్రంలోని పారిశ్రామిక రంగ భవితవ్యం ఆధారపడి ఉంటుందని, స్పష్టత వచ్చేందుకు మరికొంత సమయం పడుతుందని కొందరు పారిశ్రామికవేత్తలు భావిస్తున్నారు.

నీట్ ఫలితాల్లో అల్ఫోర్స్ విద్యార్థుల ప్రతిభ

కరీంనగర్ కమాన్‌చౌరస్తా, జూన్ 4: నీట్-24 ఫలితాల్లో అల్ఫోర్స్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చి ఉత్తమ ర్యాంకులు సాధించినట్టు విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వీ నరేందర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని వావిలాలపల్లి అల్ఫోర్స్ విద్యాసంస్థల కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. అల్ఫోర్స్ ఐఐటీ, నీట్ అకాడమీ విద్యార్థులు జాతీయ స్థాయి పరీక్షల్లో ప్రతిభ చూపడం తమకు గర్వంగా ఉందని చెప్పారు. జాతీయ స్థాయిలో ఎన్ హేమంత్ 720 మార్కులకు 691 మార్కులు సాధించాడని పేర్కొన్నారు. వీ హాసిని 671, పూజిత 650, ఎన్ కౌశిక్‌రెడ్డి 647, వీ అక్షరరెడ్డి 639 మార్కులు సాధించడం సంతోషంగా ఉందని తెలిపారు. మరో 87 మంది విద్యార్థులు 450కిపైగా మార్కులు సాధించి అల్ఫోర్స్‌లో నూతన శకానికి నాంది పలికారని చెప్పారు. ఈ విజయానికి కారణమైన అధ్యాపకులకు, విద్యార్థుల తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

తెలంగాణ ప్రజల గుండెల్లో అమరుడు 'రావి'

- నారాయణరెడ్డి 118వ జయంతి సభలో సీపీఐ నేతలు

హైదరాబాద్, జూన్ 4 (నమస్తే తెలంగాణ): తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు రావి నారాయణరెడ్డి నేటికీ తెలంగాణ ప్రజల గుండెల్లో అమరుడుగా నిలిచాడని సీపీఐ నేతలు కొనియాడారు. రావి నారాయణరెడ్డి 118వ జయంతి సందర్భంగా బంజారాహిల్స్‌లోని తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్ట్ భవన్ ఆర్ఎన్ఆర్ ఆడిటోరియంలో నారాయణరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్ట్ అధ్యక్షుడు సురవరం సుధాకర్ రెడ్డి, సీపీఐ జాతీయ కార్యదర్శి డా కే నారాయణ, జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పల్లా వెంకట్‌రెడ్డి, ఈటీ నరసింహ, తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్ట్ కార్యదర్శి కందిమళ్ల ప్రతాప్ రెడ్డి, కోశాధికారి ఉజ్జిని రత్నాకర్ రావు పాల్గొన్నారు. రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా రాష్ట్ర గేయంలో తెలంగాణ సాయుధ పోరాటం గురించి ఒక్క జ్ఞాపిక లేకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవాలను సెప్టెంబర్ 11 నుంచి 17వరకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని నారాయణ కోరారు. రావి నారాయణరెడ్డి సేవలను ఈ సందర్భంగా నేతలు గుర్తు చేసుకున్నారు.

నేడు, రేపు ఐసెట్

హనుమకొండ చౌరస్తా, జూన్ 4: తెలంగాణలో 2024-25 విద్యాసంవత్సరానికి ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాల కోసం బుధ, గురువారాల్లో ఐసెట్ నిర్వహించనున్నట్టు ఐసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ ఎస్ నరసింహాచారి తెలిపారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో ఎంపిక చేసిన పరీక్ష కేంద్రాల్లో జరిగే టీజీఐసెట్-2024కు మొత్తం రెండు తెలుగు రాష్ట్రాల్లో కలిపి 86,514 మంది అభ్యర్థులు నమోదు చేసుకున్నట్టు పేర్కొన్నారు. 5వ తేదీ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 వరకు, 6వ తేదీ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. నిమిషం ఆలస్యమైనా అనుమతించేది లేదని స్పష్టం చేశారు.

గ్రూప్-1 పరీక్షపై రోజుకో నిబంధన

హైదరాబాద్, జూన్ 4(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఈనెల 9న నిర్వహించనున్న గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష హాల్‌టికెట్లలో కొత్త నిబంధనలు తీసుకువస్తున్నారు. హాల్‌టికెట్ల డౌన్‌లోడ్ ఈ నెల 1 నుంచే ప్రారంభమైంది. అప్పుడు హాల్‌టికెట్‌పై అభ్యర్థి పాస్‌పోర్టు ఫొటో అతికించాలని చెప్పలేదు. మూడు రోజుల తర్వాత హాల్‌టికెట్‌పై ఫొటో అతికించాలని టీఎస్‌పీఎస్సీ ప్రకటించింది. ఇలా రోజుకో నిబంధన పెట్టడంతో అభ్యర్థులు అయోమయానికి గురవుతున్నారు. ప్రిలిమ్స్‌ను వాయిదా వేయాలని అభ్యర్థులు టీఎస్‌పీఎస్సీకి విజ్ఞప్తి చేసినప్పటికీ, పట్టించుకోకుండా పరీక్షలు నిర్వహించడంపై మండిపడుతున్నారు.

నేడు పీఈసెట్ హాల్‌టికెట్లు విడుదల

హైదరాబాద్, జూన్ 4 (నమస్తే తెలంగాణ): బీపీఈడీ, డీపీఈడీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఫిజికల్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (పీఈసెట్) హాల్‌టికెట్లు బుధవారం విడుదలకానున్నాయి. అభ్యర్థులు https://pecet.tsche.ac. in వెబ్‌సైట్‌ను సంప్రదించి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని కన్వీనర్ ప్రొఫెసర్ రాజేశ్‌కుమార్ తెలిపారు. ఈనెల 10 నుంచి 13 వరకు ఉదయం 6:30 నుంచి కరీంనగర్‌లోని శాతవాహన వర్సిటీలో పురుషులకు ఈ నెల 10, 11న, మహిళలకు 12, 13న టెస్టులు ఉండనున్నాయి.



శ్రేయాస్ జోసెఫ్ | సందీప్ చౌదరి | రిషబ్ షా | ఆదిత్య కుమార్
శశాంక్ శర్మ | ఇషా కొటారి | ప్రచిత | దర్శ్ పగ్దార్

నీట్‌లో నారాయణ విజయపరంపర!

720/720 మార్కులతో ఆలిండియా • ఓపెన్ క్యాటగిరీలో 8 ఫస్ట్ ర్యాకులు

హైదరాబాద్, జూన్ 4 (నమస్తే తెలంగాణ): వైద్య విద్య ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్-2024 ఆలిండియా ఓపెన్ క్యాటగిరీలో తమ విద్యార్థులు విజయ దుందుభి మోగించినట్టు నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్లు డాక్టర్ పీ సింధూర నారాయణ, పీ శరణి నారాయణ తెలిపారు. 720/720 మార్కులతో ఆలిండియా ఓపెన్ క్యాటగిరీలో సామ్ శ్రేయాస్ జోసెఫ్, కే సందీప్‌చౌదరి, షాహ్, పీ ఆదిత్యకుమార్, శశాంక్‌శర్మ, ఈషా కొఠారి, ప్రాచిత, దర్శ్ పగ్‌దార్ (ఎనిమిది మంది) ఫస్ట్ ర్యాంకులు సాధించినట్టు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 715 మార్కులు సాధించినవారిలో13 మంది, 710 మార్కులు మార్కులు సాధించిన వారిలో 20 మంది నారాయణ విద్యార్థులు ఉన్నారని వివరించారు. అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, అధ్యాపక, అధ్యాపకేతర బృందాలకు డైరెక్టర్ సింధూర నారాయణ అభినందలు తెలిపారు.

కొల్లాంకు నేడు, ఎల్లుండి రెండు ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్, జూన్ 4 (నమస్తే తెలంగాణ): దక్షిణ మధ్య రైల్వేజోన్ ఆధ్వర్యంలో బుధ, శుక్రవారాల్లో రెండు ప్రత్యేక రైళ్లను ఏర్పాటుచేస్తూ మంగళవారం రైల్వే అధికారులు నిర్ణయం తీసుకున్నారు. సికింద్రాబాద్-కొల్లాం రైల్వేస్టేషన్ల మధ్య ఈ రెండు ప్రత్యేక రైళ్లు రాకపోకలు సాగిస్తాయని వారు పేర్కొన్నారు.

ఇంటర్న్‌షిప్‌ల బాటలో ఇంజినీరింగ్ కాలేజీలు

- విద్యార్థులకు తప్పనిసరి చేస్తున్న విద్యాసంస్థలు
- మారుతున్న ఇంజినీరింగ్ కోర్సుల బోధన ట్రెండ్

హైదరాబాద్, జూన్ 4 (నమస్తే తెలంగాణ): ఇంటర్న్‌షిప్ ద్వారా చదువుకొంటూనే పరిశ్రమల పనితీరును తెలుసుకోవడం.. నైపుణ్యాలను ఆర్జించవచ్చు. ఇలాంటి ఇంటర్న్‌షిప్‌ను ఇటీవలికాలంలో విద్యాసంస్థలు, కాలేజీలు విరివిగా ప్రోత్సహిస్తున్నాయి. విద్యార్థులు కూడా ఉత్సాహంగా ఇంటర్న్‌షిప్‌లలో చేరుతున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ అన్న తేడాల్లేకుండా పలు ప్రతిష్ఠాత్మక సంస్థలు ఇంటర్న్‌షిప్‌కు అవకాశం కల్పిస్తున్నాయి. కొన్ని సంస్థలు సొంతంగా విద్యార్థులే వెతుక్కోవాలని సూచిస్తుండగా, మరికొన్ని నిర్దేశిత రంగంలో, నిర్దేశిత కంపెనీలోనే ఇంటర్న్‌షిప్‌ను ప్రోత్సహిస్తున్నాయి. మన దగ్గర ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలైన డీఆర్‌డీవో, బీహెచ్ఈఎల్, ఐటీ కంపెనీలు, బిట్స్ విద్యాసంస్థలు ఇంటర్న్‌షిప్‌ను అమలుచేస్తున్నాయి.

అన్ని కోర్సుల్లో ఇంటర్న్‌షిప్

మా కాలేజీలో అన్ని కోర్సుల్లో ఇంటర్న్‌షిప్‌ను తప్పనిసరిగా అమలుచేస్తున్నాం. మొదటి సంవత్సరంలో ఫీల్డ్ వర్క్ ఉంటుంది. ఆ తర్వాత ఆరు సెమిస్టర్‌లలో ఇంటర్న్‌షిప్‌కు అవకాశం కల్పిస్తున్నాం. విద్యార్థులు నాలుగు వారాల పాటు ఇంటర్న్‌షిప్ చేస్తారు. మా కాలేజీ విద్యార్థి ఒకరు మలేషియా యూనివర్సిటీలో 6 నెలల పాటు ఇంటర్న్‌షిప్‌కు ఎంపికయ్యారు. వీ హబ్ సహాయాన్ని పొందుతున్నారు. విద్యార్థులు బీహెచ్ఈఎల్, డీఆర్‌డీవో వంటి ప్రతిష్ఠాత్మక కంపెనీల్లో ఇంటర్న్‌షిప్‌లు చేస్తున్నారు. ఇంటర్న్‌షిప్ చేసినందుకు ఆర్థిక సహాయాన్ని పొందుతున్నారు.

- డాక్టర్ లత, సీఎస్ఈ ప్రొఫెసర్, స్టాన్లీ మహిళా ఇంజినీరింగ్ కాలేజీ

ఇంటర్న్‌షిప్ చేస్తే ఒక క్రెడిట్

మాది అటానమస్ కాలేజీ. మా కాలేజీలో మూడో సంవత్సరం మొదటి సెమిస్టర్‌లో ఇంటర్న్‌షిప్‌ను అమలుచేస్తున్నాం. దీని వ్యవధి 3 నుంచి 6 నెలల పాటు ఉంటుంది. మా కాలేజీ విద్యార్థి ఒకరికి అమెజాన్ కంపెనీలో ఇంటర్న్‌షిప్ లభించింది. ఆ విద్యార్థికి రూ.లక్ష పారితోషికం లభిస్తున్నది. ఇంటర్న్‌షిప్ చేసిన వారికి ఒక క్రెడిట్‌ను జారీచేస్తున్నారు. ఈ క్రెడిట్‌ను విద్యార్థులు పాస్ కోసం వినియోగించుకోవచ్చు. కొందరు విద్యార్థులు వారే ఇంటర్న్‌షిప్‌లను వెతుక్కొంటున్నారు. దీని ద్వారా వారి కాళ్లమీద వాళ్లు నిలబడగలిగే సామర్థ్యాలను పెంపొందించుకోవచ్చు.

- ప్రొఫెసర్ కీర్తి, సీఎస్ఈ విభాగం, గీతాంజలి కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ

ఆలయాల అభివృద్ధిపై ఐఐఎం అధ్యయనం

నివేదిక ఆధారంగా ప్రభుత్వం చర్యలు

హైదరాబాద్, జూన్ 4 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం నడుంబిగించింది. ఆయా ఆలయాల వారీగా భక్తులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, కల్పించాల్సిన సౌకర్యాలపై సమగ్ర అధ్యయనం చేసి వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని నిర్ణయించింది. ప్రభుత్వ ఆదేశాలకనుగుణంగా అహ్మదాబాద్‌కు చెందిన ఐఐఎం పట్టభద్రులు అధ్యయనం చేపట్టారు. ఆలయాల్లో భక్తుల అవసరాలను, ఎదుర్కొంటున్న సమస్యలపై ఇప్పటికే పైలెట్ ప్రాజక్టు కింద వేములవాడ ఆలయాన్ని పట్టభద్రులు సందర్శించారు. వివిధ అంశాలపై అధ్యయనం చేసి, వారు ప్రభుత్వానికి నివేదిక అందజేస్తారు. భద్రాచలం, బాసర, యాదాద్రి తదితర ప్రధాన ఆలయాల్లో కూడా అధ్యయనం చేపట్టి అభివృద్ధికి, సమస్యల పరిష్కారానికి ప్రతిపాదనలు చేయనున్నారు. వీరిచ్చే నివేదిక ప్రకారం ఆలయాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇదిలావుండగా, పేద బ్రాహ్మణ విద్యార్థులక సంబంధించిన వివేకానంద విదేశీ విద్యా పథకం పెండింగ్ దరఖాస్తులను ఎన్నికల కోడ్ పూర్తికాగానే పరిష్కరించాలని అధికారులు నిర్ణయించారు. సుమారు 500 మంది అభ్యర్థులకు ఆర్థిక సాయం మంజూరు చేయాల్సి ఉన్నదని పేర్కొన్నారు.

నీట్‌లో అనురన్ ఘోష్‌కు ఆలిండియా 77వ ర్యాంకు

- ఎస్టీ కోటాలో టాప్ 2 ర్యాంకులు మనోళ్లవే
- నీట్ ఫలితాలు విడుదల

హైదరాబాద్, జూన్ 4 (నమస్తే తెలంగాణ): నీట్ (యూజీ) ఫలితాలు విడుదలయ్యాయి. ఈ ఏడాది 67 మంది విద్యార్థులు 720కి 720 మార్కులతో ఆలిండియా టాపర్లుగా నిలిచారు. వీరిలో ఒక్కరు కూడా తెలంగాణ వారు లేకపోవడం గమనార్హం. రాష్ట్రానికి చెందిన విద్యార్థి అనురన్ ఘోష్ 99.996614 పర్సంటైల్‌తో ఆలిండియా 77వ ర్యాంకును కైవసం చేసుకొన్నాడు. ఇక ఎస్టీ కోటాలో గుగులోత్ వెంకట నృపేష్ ఆలిండియా మొదటి ర్యాంకును, లావుడ్యా శ్రీరామ్‌నాయక్ ఆలిండియా రెండో ర్యాంకును పొందారు. వీరు ఓపెన్ కోటాలోనూ ఉత్తమ ర్యాంకులు సాధించారు. గుగులోత్ వెంకట నృపేష్ ఆలిండియా 167 ర్యాంకు, లావుడ్యా శ్రీరామ్‌నాయక్ ఆలిండియా 453 ర్యాంకును కైవసం చేసుకోవడం విశేషం. దేశవ్యాప్తంగా వైద్యవిద్యాకోర్సుల్లో ప్రవేశాలకు ఈ ఏడాది 24,06, 079 మంది విద్యార్థులు నీట్‌కు రిజిస్ట్రేషన్ చేసుకొన్నారు. వీరిలో 23,33,297 మంది పరీక్ష రాయగా, 13,16,268 మంది విద్యార్థులు అర్హత సాధించారు. అయితే నిరుడు తెలంగాణ నుంచి 58శాతం విద్యార్థులే క్వాలిఫై కాగా, ఈ ఏడాది 60 శాతం విద్యార్థులు అర్హత సాధించారు.

తెలంగాణ నుంచి అర్హులైన వారు

	2024	2023
దరఖాస్తుదారులు	79,813	73,883
హాజరైనవారు	77,849	72,842
అర్హులైనవారు	47,371	42,654
శాతం	60.84%	58.55%

**మార్కులు